సాక్షి ప్రకాశం

మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



పొలం గట్టున పొంచి ఉన్న ముప్పు

పొలాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాలు కురవడంతో పాములు పుట్టల్లో నుంచి బయటకు వచ్చి రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. - 8లో..



79 మందికి కారుణ్య నియామకాలు

ఏపీఎస్ ఆర్టీసీకి సంబంధించి కారుణ్య నియామకాల కింద 79 మందికి కలెక్టర్ దినేష్ కుమార్ నియామక పత్రాలు అందించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 35/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టర్ స్పందన కార్యక్రమం రేపు



కలెక్టర్ స్పందన కార్యక్రమం నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తున్న తహశీల్దార్ ఉష

సింగరాయకొండ: స్థానిక గంజి కళ్యాణ మండపంలో ఈనెల 27వ తేదీ బుధవారం మండల స్థాయిలో కలెక్టర్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్ స్వయంగా పాల్గొంటారని తహశీల్దార్ సీహెచ్ ఉష తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ స్పందన కార్యక్రమంపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో షేక్ జమీఉల్లా మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

27న ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ జిల్లా క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27న సింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీఎస్ సుబ్బారావు, కె.వనజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభిస్తారన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాలకు చెందిన విద్యార్థులు హాజరుకావొచ్చన్నారు. అండర్–14, అండర్–17 జట్ల ఎంపికకు నిర్వహించే ఈ ప్రక్రియలో అండర్–17 విభాగంలో హాజరుకాదలచిన ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నంబరు, సంబంధిత ప్రిన్సిపాల్ ధ్రువీకరణతో నిర్వాహకులకు సమర్పించి హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు ఫిజికల్ డైరెక్టర్లు కె.మాల్యాద్రి, జంషీర్ అహ్మద్‌లను సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి డాడ్జ్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన డాడ్జ్‌బాల్ క్రీడాకారులు

చీమకుర్తి: డాడ్జ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చీమకుర్తిలో నిర్వహించిన క్రీడాకారుల ఎంపికలో పలువురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాలోని పలు పాఠశాలల నుంచి హాజరైన క్రీడాకారుల్లో 12 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 1, 2 తేదీల్లో బాపట్ల జిల్లా చిలుమూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు తెలిపారు.

26, 27న పాఠశాల సముదాయాల సమావేశాలు

ఒంగోలు: పాఠశాల సముదాయాల సమావేశాలు ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ వీఎస్ సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో హెడ్మాస్టర్లను ఆదేశించారు. 26వ తేదీ ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి 50 శాతం మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, మిగిలిన 50 శాతం మంది ఉపాధ్యాయులు ఈనెల 27న హాజరుకావాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించి ఈనెల 26న తెలుగు, గణితం, బయాలజీ ఉపాధ్యాయులు, 27న ఇంగ్లిషు, హిందీ, సోషల్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరుకావాలన్నారు. 30వ తేదీన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు నిర్వహించాలని ఆయా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్రశిక్ష కార్యాలయం జారీచేసిన అజెండా ప్రకారం నిర్ణీత షెడ్యూలు మేరకు సమావేశాలు నిర్వహించి మినిట్స్ నమోదు చేయాలన్నారు. హాజరైన ఉపాధ్యాయుల వివరాలను మెయిల్ ద్వారా తెలియజేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు తప్పనిసరిగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరుకావాలని చెప్పారు.

నగరం సరికొత్తగా..

ఒంగోలు నగరం రూపు రేఖలు మారిపోతున్నాయి. ఐదారు నెలలుగా బయట ఉండి ఒంగోలు నగరంలోకి అడుగు పెడుతుంటే.. సరికొత్త మార్పులతో పచ్చదనం స్వాగతిస్తోంది. నగరంలో రోడ్ల విస్తరణతో పాటు సుందరీకరణపై నగర పాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. హరిత కాంతులు వెల్లివిరిసేలా పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు..డివైడర్లు, రోడ్లకు ఇరు వైపులా మొక్కలు నాటుతున్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టింది.

- మారుతున్న ఒంగోలు నగర రూపురేఖలు
- నగర సుందరీకరణ, అభివృద్ధికి ప్రాధాన్యం
- రోడ్డు విస్తరణ, పార్కుల అభివృద్ధికి నగరపాలక సంస్థ చర్యలు
- పర్యావరణ పరిరక్షణతో పాటు వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు కసరత్తు
- నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం ద్వారా రూ.9.10 కోట్లు కేటాయింపు
- ఇప్పటికే రూ.3.7 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం



దక్షిణ బైపాస్‌లో తీర్చిదిద్దిన కాసు బ్రహ్మానందరెడ్డి పార్కు

ఒంగోలు నగరం ఆబ్‌స్ట్రాక్ట్

ఒంగోలు ఏర్పడిన సంవత్సరం	1876
నగర పాలక సంస్థగా రూపాంతరం:	2012
2011 లెక్కల ప్రకారం జనాభా	2,51,175 మంది
ప్రస్తుత జనాభా	3,01,410
నగరంలో ఇళ్లు	74,422
కార్పొరేషన్‌లో డివిజన్లు	50
నగరంలో రోడ్ల పొడవు	420 కి.మీ
నగరంలో డ్రెయిన్లు	630 కి.మీ
ప్రతి రోజూ చెత్త సేకరణ	125 మెట్రిక్ టన్నులు
మేయర్‌తో పాటు 50 మంది కార్పొరేటర్లు, స్టాండింగ్ కమిటీ	

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర అభివృద్ధికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి నగరాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని నగర పాలక సంస్థ అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో జగనన్న హరిత నగరాలు, నేషనల్ ఎయిర్ క్లీన్ ప్రోగ్రాం కార్యక్రమాల్లో భాగంగా నగర సుందరీకరణ పనుల్లో వేగం పుంజుకున్నాయి. జగనన్న హరిత నగరాల్లో భాగంగా నగరంలో ఏ ఏ ప్రాంతాల్లో ఏ విధమైన పనులు చేపట్టాలని అధికారులు ముందుగా సర్వే చేసుకున్న ప్రకారం ఆ విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అదేవిధంగా నేషనల్ ఎయిర్ క్లీన్ ప్రోగ్రాంలో భాగంగా కూడా నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ముమ్మరంగా చేస్తున్నారు.

నగరంలో 8 హాట్‌స్పాట్స్ గుర్తింపు:

ఒంగోలు నగరంలో వాతావరణ కాలుష్యం, గాలి కాలుష్యం ఎక్కువగా ఉన్న ఎనిమిది ప్రాంతాలను అధికారులు గుర్తించారు. అంటే అక్కడ రోడ్లు సరిగ్గా లేకపోవటం, పచ్చదనం లేకపోవటంతో మురుగు ఏర్పడి దోమల బెడద ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో నేషనల్ ఎయిర్ క్లీన్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా రోడ్లు విస్తరింప చేయటం, విస్తారంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. నగరంలో ప్రధానంగా అధికారులు గుర్తించిన ప్రాంతాలు దక్షిణ బైపాస్ రోడ్డు పరిసర ప్రాంతాలు, ముంగమూరు రోడ్డు పరిసర ప్రాంతాలు, ఆర్టీసీ బస్టాండ్–కొత్త కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాలు, ట్రంకురోడ్డు వై జంక్షన్ నుంచి దక్షిణ బైపాస్ రోడ్డు, మంగమ్మ కాలేజీ జంక్షన్ నుంచి ఉత్తరం బైపాస్ వరకు, గుత్తికొండవారిపాలెం డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాలు, కర్నూలు రోడ్డు, పాత జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంతాలను గుర్తించారు.



ముంగమూరు రోడ్డు జంక్షన్ నుంచి పాత గుంటూరు రోడ్డు ఏఎంసీ వరకు డివైడర్ల మధ్యలో మొక్కలు నాటుతున్న దృశ్యం

నగర సుందరీకరణ కోసం రూ.9.10 కోట్లతో అంచనాలు

ఒంగోలు నగరంలో జనాభా రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా నగరాన్ని అభివృద్ధి చేయటంతో పాటు సుందరీకరణకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి తలంచారు. ఆమేరకు నేషనల్ ఎయిర్ క్లీన్ ప్రోగ్రాంలో భాగంగా నగర సుందరీకరణ కోసం రూ.9.10 కోట్లతో అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2020–21 సంవత్సరం నుంచి పనులు చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు. మొదటి సంవత్సరం ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. 2021–22 సంవత్సరంలో రూ.0.64 కోట్లు, 2022–23 సంవత్సరంలో రూ.2.51 కోట్లు నిధులను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మూడు సంవత్సరాలకు గాను మొత్తం రూ.5.16 కోట్లు మంజూరు చేయగా రూ.3.79 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పటి వరకు ఈ మూడు సంవత్సరాలకు గాను 16 పనులు చేపట్టి రూ.1.86 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటికే విడుదలైన నిధులతో ఒంగోలు నగరంలోని సిమెంట్ రోడ్లు విస్తరణ పనులు, డివైడర్ల నిర్మాణ పనులు, మధ్యలో మొక్కలు నాటే కార్యక్రమాలతో పాటు పార్కుల అభివృద్ధి, సుందరీకరణ పనులు కూడా ముమ్మరంగా చేపడుతున్నారు. 2023–24 సంవత్సరానికి గాను మొత్తం 20 పనులతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందుకుగాను రూ.3.91 కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనాలు రూపొందించి ప్రతిపాదలను సిద్ధం చేశారు. ఇప్పటికే జాయింట్ కలెక్టర్ శ్రీనివాస రావు ఈ పనులపై సమీక్ష నిర్వహించిన అనంతరం సిటీ లెవల్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశంలో కూడా ఆమోదింపజేశారు. ఈ నాలుగు సంవత్సరాలకు కలిపి మొత్తం రూ.9.10 కోట్లతో పూర్తి స్థాయిలో పనులు చేపట్టనున్నారు.



ఒంగోలు గిత్తల బొమ్మలతో ఐ లవ్ ఒంగోలు స్వాగత బోర్డు



పాత జెడ్పీ సమావేశ మందిరం నుంచి చర్చి సెంటర్ వరకు చేపట్టిన సిమెంట్ రోడ్డు విస్తరణ పనులు

ప్రజలకు మౌలిక వసతులు కల్పించటమే ధ్యేయంగా..



ఒంగోలు నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పించటమే ధ్యేయంగా ప్రణాళికలు రూపొందించాం. అందుకోసం మరో ఆరు నెలల్లో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం. కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించాం. అదేవిధంగా నగరవాసులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచటానికి రోడ్ల మధ్యలో డివైడర్ల అభివృద్ధి, మధ్యలో చెట్ల పెంపకంతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని రూపొందించేందుకు ప్రణాళికలు రూపొందించాం. పార్కుల అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం.

– బాలినేని శ్రీనివాస రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే

నగరాన్ని వేగంగా అభివృద్ధి చేస్తున్నాం



ఒంగోలు నగరాన్ని వేగంగా అభివృద్ధి చేస్తున్నాం. గతంలో ఎన్నడూ లేనివిధంగా నగరాన్ని అభివృద్ధి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు క్లీన్ ఒంగోలు–గ్రీన్ ఒంగోలు మాదిరిగా తీర్చిదిద్దుతున్నాం. నేషనల్ ఎయిర్ క్లీన్ ప్రోగ్రాంతో పాటు జగనన్న హరిత నగరాల్లో భాగంగా నగరాన్ని సుందరీకరిస్తున్నాం. నగరంలో రోడ్ల విస్తరణతో పాటు, పచ్చదనాన్ని పెంపొందిస్తున్నాం.

– గంగాడ సుజాత, మేయర్, ఒంగోలు నగర పాలక సంస్థ

నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంగా తీర్చిదిద్దుతున్నాం



ఒంగోలు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తీసుకోవాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఆకాంక్షల మేరకు నగరాన్ని అభివృద్ధి చేస్తున్నాం. నేషనల్ ఎయిర్ క్లీన్ ప్రోగ్రాం, జగనన్న హరిత నగరాల్లో భాగంగా నగరంలో సుందరీకరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. నగరంలోని ప్రధాన కూడళ్లు, ప్రధాన రహదారులతో పాటు ఇతర ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. నగరాన్ని పచ్చదనంతో నింపటమే ధ్యేయంగా ప్రణాళాబద్ధంగా పనులు చేస్తున్నాం.

– ఎం.వెంకటేశ్వరరావు, కమిషనర్, ఒంగోలు నగర పాలక సంస్థ

జిల్లా సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



జెడ్పీకార్యాలయంలో జెడ్పీటీసీలతో కలసి కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు: జిల్లా సమగ్ర అభివృద్ధే తమ పాలకవర్గం లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేసి జెడ్పీటీసీ సభ్యులు, జెడ్పీ ఉద్యోగులకు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆమెతో పాటు కుమారుడు, దర్శి మాజీ ఎంఎల్‌ఏ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఉన్నారు. పలువురు జెడ్పీటీసీలు, జెడ్పీ ఉద్యోగులు బూచేపల్లి వెంకాయమ్మను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ రెండు సంవత్సరాల్లో తమ పాలకవర్గం జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషిచేయగలిగామని, ఇందుకు సహకరించిన జిల్లా అధికారులు, సిబ్బందికి అందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి, అదే విధంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. 72 మందికి కారుణ్య నియామకం కింద ఉపాధి కల్పించామన్నారు. కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబాలు ఎంతగా తల్లడిల్లుతాయో ఒక మహిళగా తనకు తెలుసని, ఆ క్రమంలో భాగంగానే వేగవంతంగా కారుణ్య నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. 52 మందికి పదోన్నతులు కూడా కల్పించామన్నారు. జిల్లా అభివృద్ధిని కాంక్షిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా ప్రథమ స్థానంలా ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

పులుల బారిన పడకుండా చర్యలు



అటవీశాఖపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పులుల సంఖ్యతోపాటు అడవుల్లో సంచరిస్తున్న ప్రాంతం కూడా పెరుగుతున్నందున ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులు పులుల బారిన పడకుండా ఇతర ప్రాంతాలకు తరలించే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి అంశాలపై సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనులను రీ లొకేట్ చేయడంలో వారికి అవసరమైన జీవనోపాధి చూపి స్థిర నివాసం కల్పించాలన్నారు. మధ్యప్రదేశ్‌లోని సాత్పూరా ప్రాంతంలో అనుసరించిన విధానాలను ఇక్కడ కూడా అమలు చేసేలా పరిశీలన చేయాలన్నారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చిన స్థలాలకు సంబంధించి ఎటువంటి వివాదాలు లేకుండా చూడాలన్నారు. అటవీ, రెవెన్యూ అధికారులు మరోసారి సంయుక్తంగా సర్వే చేయాలని ఆదేశించారు. రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో పట్టాలు మంజూరు చేసినట్లు గుర్తిస్తే వాటిని రద్దు చేసి గిరిజనులకు రెవెన్యూ భూములు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ (ఫారెస్ట్) జీ విఘ్నేష్, మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్‌ఓ శ్రీలత, డీఎఫ్‌ఓ సునీత, డీడీ వై నరసింహులు, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారంపై శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ స్పందనలో 332 అర్జీలు
- స్పందన నిర్వహించిన కలెక్టర్ దినేష్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్


ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన సమస్యల అర్జీలను పరిష్కరించడంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందనలో మొత్తం 332 అర్జీలు వచ్చాయి. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు రీ ఓపెన్ కాకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి పక్కాగా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అందించే సేవల ద్వారా ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరగాలన్నారు. ఏదైనా కారణాలతో సమస్యను పరిష్కరించలేనప్పుడు అర్జీదారులను పిలిచి వారికి తగిన వివరణ ఇవ్వాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు ఉమాదేవి, లోకేశ్వరరావు, వరకుమార్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కనిగిరి మండలం తుమ్మలగుంట గ్రామానికి చెందిన శివకృష్ణ సర్వే నంబర్ 247–3లో ఉన్న తన భూమి మరొకరి పేరుపై ఆన్‌లైన్ ఎక్కించారని, అయితే ప్రస్తుతం ఈ కేసు కోర్టులో ఉందని తెలిపారు. పరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరారు.

కొమరోలు మండలం నల్లగుంట్ల గ్రామానికి చెందిన వై రమణారెడ్డి డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి తమ గ్రామంలో గేదెలకు అనారోగ్యం కలిగినా, సచివాలయంలోని వెటర్నరీ అసిస్టెంట్ స్పందించడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. పరిశీలించి పశువులకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరాడు.

‘సాక్షి’ ఫొటోగ్రాఫర్‌కు ప్రతిభ పురస్కార్ అవార్డు





బహుమతి పొందిన చిత్రం, ఎం.ప్రసాద్ (ఇన్‌సెట్‌లో)

ఒంగోలు మెట్రో: ప్రపంచ టూరిజం దినోత్సవం సందర్భంగా విజయవాడలో ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ సహకారంతో నిర్వహించిన ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమంలో ఒంగోలుకి చెందిన ‘సాక్షి’ సీనియర్ ఫొటోగ్రాఫర్ ఎం.ప్రసాద్ తీసిన చిత్రానికి గోల్డ్‌మెడల్, ప్రతిభా పురస్కారం లభించింది. కొత్తపట్నం సముద్ర తీరంలో సూర్యోదయ సమయంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లే చిత్రం ఈ అవార్డుకు ఎంపికైనట్టు నిర్వాహకులు మెయిల్ ద్వారా తెలిపారు. ఈనెల 27న విజయవాడలో జరగనున్న కార్యక్రమంలో పురస్కారం అందిస్తారు.

క్లుప్తంగా

రైల్లో నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

గిద్దలూరురూరల్: రైల్లో నుంచి జారిపడి వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని దిగువమెట్ట రైల్వే బ్రిడ్జి సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..ఒడిశా ప్రాంతానికి చెందిన దీపక్ మండేలా అనే వ్యక్తి ఆదివారం రాత్రి రైలులో ప్రయాణిస్తూ దిగువమెట్ట బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు క్షతగాత్రుడిని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యూత్ రెడ్‌క్రాస్‌లో మెంబర్‌షిప్ పెంచాలి

ఒంగోలు అర్బన్: యూత్ రెడ్‌క్రాస్‌లో మెంబర్‌షిప్ పెరగాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. ప్రకాశంభవనంలో సోమవారం యూత్ రెడ్‌క్రాస్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అన్నీ స్కూల్స్, కాలేజీ, యూనిర్శిటీల్లో అవగాహన కల్పించి యువతను సభ్యులుగా చేర్పించాలన్నారు. ఈ ప్రక్రియ అక్టోబర్ లోగా పూర్తి చేయాలన్నారు. మెబర్‌షిప్ ఎక్కువ సంఖ్యలో చేసిన వారికి ప్రోత్సాహకాలు అందచేయాలన్నారు. కార్యక్రమంలో సెప్ సీఈఓ లోకేశ్వరరావు, డీఈఓ సుబ్బారావు, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మా నాయక్ ఇతర అధికారులు, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, బైకు ఢీకొని వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పులి వెంకటరెడ్డి

ఒంగోలు టౌన్: మోటారు బైక్, ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బియ్యం వ్యాపారం చేసే ఒంగోలు శ్రీనగర్ కాలనీకి చెందిన పులి వెంకట రెడ్డి సోమవారం మధ్యాహ్నం కరవదికి వెళుతున్నారు. ఆ సమయంలో అటుగా వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన వెంకటరెడ్డి అక్కడికక్కడే మరణించారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో సర్పంచ్ మృతి

దర్శి: గుండెపోటుతో దేవవరం సర్పంచ్ జొన్నలగడ్డ సుషన్న (40)సోమవారం సాయంత్రం మృతి చెందారు. సుషన్నకు సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా గుండెల్లో నొప్పి వచ్చింది. దీంతో భర్త కొర్నేలుకు విషయం చెప్పగా..ఆస్పత్రికి తీసుకువెళ్లే లోగా మృతి చెందింది. సర్పంచ్ అకస్మికంగా మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. వారికి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి సంతానం ఉన్నారు.

వాహనం ఢీకొని హిజ్రా మృతి

కొత్తపట్నం: కారు ఢీకొని హిజ్రాకు తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన కొత్తపట్నం–అల్లూరు మధ్యలో పెట్రోలు బంకు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు..కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం గ్రామానికి చెందిన వల్లబుని లాస్య (20) ఇంటి దగ్గర పనులు చేసుకుంటూ ఉంటుంది. ఈ నెల 21న మోనోలిత, లాస్యాలు కలిసి ద్విచక్రవాహనంపై కొత్తపట్నం నుంచి ఒంగోలు వెళుతున్నారు. అల్లూరు గ్రామం పెట్రోలు బంకు సమీపానికి వచ్చేసరికి ద్విచక్రవాహనం పంక్చర్ అయింది. ఈ సమయంలో కొత్తపట్నం నుంచి ఒంగోలు వెళుతున్న బొలేరో వాహనం అదుపు తప్పి లాస్యను ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా..అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ మేరకు ఎస్సై బి.సాంబశివరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు ప్రజలను మోసం చేసింది ఆ ముగ్గురే

- సీపీఐ నేత డాక్టర్ కె.నారాయణ

ఒంగోలు టౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ రమణలు ఇరు రాష్ట్రాలకు చెందిన తెలుగు ప్రజలను మోసం చేశారని సీపీఐ నేత డాక్టర్‌కె.నారాయణ ఘాటుగా వ్యాఖ్యానించారు. సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి చెన్నయ్ వెళ్తూ మార్గంమధ్యలో ఒంగోలులో కాసేపు ఆగిన ఆయన మీడియాతో మాట్లాడారు. విభజన హామీలు అమలు చేయకుండా తెలుగు ప్రజలపై కక్షతీరుతో వ్యవహరించిన మోదీ తెలుగు ప్రజలకు తొలి శత్రువని ఆరోపించారు. రాష్ట్ర విభజన చట్టాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన ఎం.వెంకయ్యనాయుడు ఆ తర్వాత ఉప రాష్ట్రపతిగా అత్యున్నత పదవిలో కొనసాగినా తెలుగు ప్రజలకు ఎలాంటి మేలు చేయలేక పోయారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందారని, తెలుగు జాతికి, తెలుగుభాష గురించి బాగా తెలిసిన నాయకుడై ఉండి కూడా న్యాయం చేయలేక పోయారన్నారు. చీఫ్ జస్టిస్‌గా పనిచేసిన రమణ కూడా తన పదవీ కాలంలో తెలుగు ప్రజానికి అన్యాయం చేశారని ఆరోపించారు. చంద్రబాబును అరెస్టు చేయడంతో కొంపలేమీ మునిగిపోవన్నారు. పోరాట పటిమ లోపించడం టీడీపీలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. లోకేష్, పవన్ కళ్యాణ్‌లు బీజేపీ తోక పట్టుకొని తిరుగుతున్నారని, కసాయి వాడినే వారు నమ్ముతున్నారన్నారు. లోకేష్ రాజకీయంగా పిరికి చేష్టలు కలవాడని నారాయణ వ్యాఖ్యానించారు.



పొలంలో ఉన్న తాచుపాము



చెట్టుపై ఉన్న కట్లపాము



కొండచిలువను పట్టుకున్న నిరంజన్

పొలం గట్టున పొంచి ఉన్న ముప్పు!

- 20 రోజుల వ్యవధిలో పొలాల్లో 10 పాముల పట్టివేత
- పత్తి, మిరప తోటల్లో అధికంగా సర్పాల సంచారం

మార్కాపురం:

పొలాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాలు కురవడంతో పాములు పుట్టల్లో నుంచి పొలాల్లోకి వచ్చి రైతులను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏ క్షణం ఎటువైపు నుంచి ఎలాంటి పాము వస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి, మిరప పొలాల్లోనే పాముల సంచారం అధికంగా ఉంది. వారం రోజుల క్రితం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రామచంద్రాపురం రైతు పాముకాటుకు గురయ్యారు. సకాలంలో చికిత్స అందించడంతో ప్రాణానికి ప్రమాదం తప్పింది.

హలో.. సార్.. పాము!

పాముల్లో అత్యంత విషపూరితమైన పాముల్లో మొదటిది రక్తపింజర, రెండోది తాచు, మూడోది కట్ల పాము. మార్కాపురం ప్రాంతంలో ఇటీవల కాలంలో ఎక్కువగా రక్తపింజరలు సంచరిస్తుండటంతో ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. మార్కాపురం ప్రాంతంలో అధికారికంగా స్నేక్ రెస్క్యూ టీమ్ సభ్యుడైన నిరంజన్ 20 రోజుల వ్యవధిలో 10 పాములను పట్టుకున్నారు. రామచంద్రాపురం, రాయవరం, కొండేపల్లి, నికరంపల్లి బడేఖాన్‌పేట, బుడ్డపల్లి, మాల్యవంతునిపాడు, సీతానాగులవరం తదితర గ్రామ పొలాల్లో పాములను గుర్తించిన రైతులు సకాలంలో స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇవ్వడంతో బంధించి అటవీ ప్రాంతంలో వదిలారు. వీటిలో ఎక్కువగా రక్తపింజర, తాచు, కట్లపాములు ఉన్నట్లు స్నేక్ క్యాచర్ 'సాక్షి'కి వివరించారు.

రక్తపింజర యమా డేంజర్

ఐదు అడుగుల పొడవుండే రక్తపింజర పాముల్లో అత్యంత ప్రమాదకరమైంది. కాటేసిన 40 నిమిషాల్లోపు వైద్య చికిత్స అందకపోతే ప్రాణానికి ప్రమాదం. కాలుకు గురైన వారి శ్వాస వ్యవస్థ దెబ్బతినడంతోపాటు శరీరమంతా చెమటలు పడతాయి. రక్తపింజర విషం రక్తాన్ని వేగంగా పలుచన చేస్తుంది. తద్వారా గుండె బలహీనపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం అధికంగా ఉంటుంది. ఎక్కువగా గడ్డి, పొదలు, పత్తి, మిరప, పొగాకు, కంది చేలల్లో రక్తపింజరలు కనిపిస్తున్నాయి.

గ్రామాల్లోకి కొండచిలువలు

మార్కాపురం ప్రాంతంలో కొండచిలువలు జనావాసాల మధ్యకు వస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. 18 అడుగుల పొడవు 90 నుంచి 100 కిలోల బరువు ఉండే కొండచిలువలు పొలాల్లో రైతులను భయపెడుతున్నాయి. ఇటీవల కాలంలో 3 ప్రాంతాల్లో భారీ కొండచిలువలు పట్టుకుని అడవుల్లో వదిలేశారు. నల్లమల అడవుల్లో నుంచి సమీప గ్రామాల్లోకి వస్తున్న కొండచిలువలు కోళ్లు, మేకలు, కుందేళ్లు, జింకలను భుజిస్తున్నాయి. భారీ కొండచిలువలు మనిషిని చుట్టేస్తే దాని పట్టు నుంచి బయటపడటం చాలా కష్టం

జిల్లా వైద్యశాలలో మందులు సిద్ధం



మార్కాపురం జిల్లా వైద్యశాలలో పాముకాటుకు సంబంధించి ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఆస్పత్రికి ప్రతి నెలా 15 నుంచి 20 పాముకాటు కేసులు వస్తున్నాయి. పాము, తేలు, విషపురుగులు కుట్టిన వెంటనే జిల్లా వైద్యశాలకు వస్తే సకాలంలో చికిత్స అందిస్తాం. ఏమాత్రం ఆలస్యం చేసినా ప్రాణాలమీదకు కొనితెచ్చుకున్నట్టే.

– ఎస్.సుబ్బారెడ్డి, మార్కాపురం జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్

పొలాల్లో ఎక్కువగా పాముల బెడద



పత్తి, మిర్చి చేలల్లో రక్తపింజర పాములు ఎక్కువగా కనిపిస్తున్నాయి. భయమైనా సరే పొలానికి వెళ్లక తప్పదు. పంటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లిన సందర్భాల్లో చాలాసార్లు రక్తపింజర, తాచు, కట్లపాములు కనిపించాయి. జాగ్రత్తగానే ఉంటున్నాం.

– తిరుమలరెడ్డి రామిరెడ్డి, రైతు, వేములకోట

త్రిపురాంతకం ఆలయాల హుండీ ఆదాయం

రూ.11,35,564



త్రిపురాంతకంలో హుండీ కానుకలు లెక్కిస్తున్న సేవసమితి సభ్యులు, ఈఓ



ఆలయ ఈఓ, కమిటీ సభ్యులకు వెండి కిరీటం అందజేస్తున్న భక్తులు

త్రిపురాంతకం: బాలాత్రిపురసుందరీ దేవి, పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానాల్లో భక్తులు రెండు నెలల 12 రోజుల వ్యవధిలో హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. మొత్తం రూ.11,35,564 ఆదాయం వచ్చిందని ఈఓ చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. బాలా త్రిపురసుందరీదేవి ఆలయంలో రూ.8,06,770, త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో రూ.3,28,794 వచ్చినట్లు ఈఓ వివరించారు. హుండీ కానుకల లెక్కింపులో దేవదాయ ధర్మాదాయ శాఖ డివిజన్ అధికారి బి.నాగమల్లేశ్వరరాజు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నారాయణస్వామికి వెండి గొడుగు విరాళం

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామివారి ఆలయానికి ఆదివారం వరకు రూ.1,17,089 ఆదాయం వచ్చినట్లు ఈఓ జి.రమణారెడ్డి సోమవారం తెలిపారు. స్వామివారి దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.69,920, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.29,940, శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.17,229 వచ్చినట్లు ఈవో వివరించారు. కొమరోలు మండలం గోపాలునిపల్లికి చెందిన బొమ్మిని సుబ్బరాయుడు, సుబ్బయ్య స్వామివారి విగ్రహమూర్తులకు సుమారు రు.20 వేల విలువైన వెండి గొడుగును విరాళంగా ఈఓ రమణారెడ్డి, దేవస్థాన కమిటీకి అందజేశారు. దాతలను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు మంచికంటి మధుసూదన రావు, జిలకర నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఏడుకొండలు



మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఏడుకొండలు

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఏడుకొండలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పూర్తి అదనపు బాధ్యతలతో ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ సుధాకర్‌బాబు స్థానంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విశాఖపట్నం ఆంధ్రమెడికల్ కాలేజీలో రేడియోథెరపీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఏడుకొండలు ప్రభుత్వ మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. దీంతో ఆయన మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్‌ను ప్రొఫెసర్‌లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, జీజీహెచ్ అధికారులు అభినందనలు తెలిపారు.

79 మందికి కారుణ్య నియామకాలు



కారుణ నియామక పత్రాలు అందుకున్న సిబ్బందితో కలెక్టర్

- నియామక పత్రాలు అందచేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీకి సంబంధించి కారుణ్య నియామకాల కింద 79 మందికి ఉద్యోగాలు కల్పిస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం స్పందన భవనంలో అభ్యర్థులకు కారుణ్య నియామక పత్రాలు అందచేశారు. 2022 జనవరి నుంచి ఆర్టీసీ ఉద్యోగులు కరోనా, ఇతర కారణాలతో మృతి చెందడంతో అర్హులైన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించారు. మొత్తం 79 మందిలో 53 మందికి సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించగా మిగిలిన 26 మందికి వివిధ శాఖల్లో ఆఫీస్ సబార్డినేట్‌లుగా నియమిస్తూ ఉత్తర్వులు అందచేశారు. ఉద్యోగాలు పొందిన వారిలో 26 మంది మహిళలు, యువతులు ఉన్నారు. ఉద్యోగాలు పొందిన వారు అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, కలెక్టరేట్ పరిపాలనా అధికారి కె.చిరంజీవి, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి, ఆర్టీసీ సూపరింటెండెంట్ ఫణికుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో ఆరు స్వర్ణాలు కైవసం



బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులతో రెజ్లింగ్ సంఘ కార్యదర్శి సురేష్

జరుగుమల్లి: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు స్వర్ణ పతకాలతో సత్తా చాటారని ప్రకాశం జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.సురేష్‌రెడ్డి సోమవారం తెలిపారు. విశాఖపట్నంలోని మధురవాడలో చంద్రపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏపీ రెజ్లింగ్ సంఘ అధ్యక్షుడు ఎం.సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ విభాగాల్లో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. సీనియర్ మహిళలు 89 కేజీల విభాగంలో ఒంగోలు డివిజన్ కమ్మపాలెం వార్డు సచివాలయం సెక్రటరీ ఎస్.అంజనాదేవి స్వర్ణం సాధించారు. 71 కేజీల విభాగంలో సీనియర్ క్రీడాకారిణి కె.కోటేశ్వరి(ఏకేవీకే కాలేజ్, ఒంగోలు), 69 కేజీల విభాగంలో దాసరి నిఖితాదేవి(ఒంగోలు), 58 కేజీల విభాగంలో డి.రాజు, 63 కేజీల విభాగంలో కె.మణికంఠ, 130 కేజీల విభాగంలో ఎస్.అష్రఫ్ హుస్సేన్ కందుకూరులో జరిగిన పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. వీరు ఈ నెల 26 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు హర్యానాలోని రోహతక్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారులను డీఎస్ఏ చీఫ్ కోచ్, పలు క్రీడా సంఘాల ప్రతినిధుల కోచ్ బి.శ్రీలక్ష్మి, జిల్లా అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అభినందించారు.

ఉత్కంఠగా సాగుతున్న క్రికెట్ పోటీలు



క్రికెట్ మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

మార్కాపురం: మార్కాపురం ఎస్‌వీకేపీ కళాశాలలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు రెండో రోజు సోమవారం ఉత్కంఠ భరితంగా సాగాయి. జిల్లా క్రికెట్ సెలక్షన్ అధ్యక్షుడు వెంకటాద్రిరెడ్డి, ఆర్గనైజర్ ప్రతాపరెడ్డి, సీనియర్ ప్లేయర్ సుమన్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్‌ల వివరాలు..

- తొలి మ్యాచ్‌లో కుమ్మరి వీధి టీమ్ 61 పరుగులు చేయగా అనంతరం బరిలోకి దిగిన విజయ్ టీమ్ 59 పరుగులు చేసింది. దీంతో కుమ్మరి వీధి టీమ్ 6 పరుగుల ఆధిక్యంతో గెలుపొందింది.
- రెండో మ్యాచ్‌లో చిన్నమసీద్ టీమ్ వర్సెస్ ఎ1 గ్లోబల్ కళాశాల టీమ్‌లు పోటీపడ్డాయి. చిన్నమసీద్ టీమ్ 83 పరుగులు చేయగా ఎ1 గ్లోబల్ కళాశాల టీమ్ 47 పరుగులకు ఆలౌట్ అయింది.
- మూడో మ్యాచ్‌లో గొల్లపల్లి టీమ్ వర్సెస్ పూలసుబ్బయ్య కాలనీ టీమ్‌లు తలపడ్డాయి. పూలసుబ్బయ్య కాలనీ టీమ్ 68 పరుగులు చేయగా గొల్లపల్లి టీమ్ 70 పరుగులు చేయడంతో విజయం సాధించింది.
- నాలుగో మ్యాచ్‌లో మైలూ టీమ్, సాయి టీమ్ తలపడగా మ్యాచ్ టై అయింది. సూపర్ ఓవర్‌లో సాయి టీమ్ గెలుపొందింది.

పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు అధికారులు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో పర్యాటక ప్రాంతాలపై విద్యార్థులు అవగాహన కలిగి ప్రకృతి అందాలను అస్వాదించి పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.భరద్వాజ్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక హర్షిణి డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా టూరిజం అధికారి బెనహర్ మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి సందర్శించాలని కోరారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆర్ లోకనాథం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యం కూడా కలిగి ఉంటే జీవితంలో స్థిరపడవచ్చన్నారు. ప్రతి ఒక్క విషయాన్ని పరిశీలించి అందులో ఉన్న నైపుణ్యాన్ని పరిశీలించాలని కోరారు. నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి కమలషా, కళాశాల ప్రిన్సిపాల్ డి.ఆంజనేయులు టూరిజం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 27న కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందిస్తామని చెప్పారు.

ఆర్మీ సెలక్షన్స్‌లో ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విజయఢంకా



ఆర్మీ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులతో అకాడమీ చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి

తిరుపతి రూరల్: గుంటూరులో ఈనెల 24న నిర్వహించిన ఆర్మీ సెలక్షన్స్‌లో తిరుపతి ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు వివిధ విభాగాల్లో విజయదుందుభి మోగించినట్లు అకాడమీ చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతిలోని అకాడమీలో ఆర్మీ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీ సెలక్షన్స్‌లో అకాడమీకి చెందిన 85 మంది విద్యార్థులు వివిధ విభాగాలకు ఎంపికైనట్లు తెలిపారు. టెక్నికల్–17, జీడీ–66, ట్రేడ్స్‌మెన్–2 ఇలా మొత్తం 85 మంది సెలక్ట్ అయినట్లు చెప్పారు. అకాడమీలో విద్యతో పాటు డిఫెన్స్‌లో ఉద్యోగాలు సాధించేందుకు శారీరక, మానసిక, సాంకేతిక, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు అకాడమీలో ఉచిత విద్యను అందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్పీబీకి ఘన నివాళి



బాలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రంగ భూమి కళాకారులు

ఒంగోలు మెట్రో: గాన గాంధర్వుడు, పద్మశ్రీ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 3వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఒంగోలులో సీవీఎన్ రీడింగ్ రూమ్ క్లబ్ ఆవరణలో జిల్లా రంగభూమి కళాకారుల సంఘం, ప్రకాశం జిల్లా సంగీత కళాకారుల సంఘం, ప్రకాశంజిల్లా సంగీత కళాకారుల సమాఖ్య, బాలు కళా సమితి, ఆల్ ఇండియా కళా రంగం వారి ఉమ్మడి ఆధ్వర్యంలో బాలు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు కళాకారులు బాలు ప్రతిభను కొనియాడారు. ఈ కార్యక్రమంలో చల్లా నాగేశ్వరమ్మ, ఎస్‌కే.బాబు, నక్కా సుకుమార్, ఎ.మనోహర్, నల్లమల్లిపొండు, రంగనాథం, అంగలకుర్తి ప్రసాద్, దేనువకొండ సుబ్బయ్య, పి.శివ, పరుచూరి నాగేంద్రమ్మ, తదితరులు పాల్గొనిఆయనకు ఘన నివాళి అర్పించారు. రాబోయే బాలు జయంతి లోపు ఒంగోలులో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా ప్రయత్నాలు చేస్తామని తెలిపారు.